క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కనిగిరి రూరల్: పట్టణంలోని 12వ సచివాలయ పరిధిలోని 20వ వార్డులో బుధ, గురువారాల్లో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేది బుధవారం ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని కోరారు.

నేడు బింగినపల్లిలో...

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ సామంతుల రవి కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల, గ్రామస్థాయి అధికారులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

మెడికల్ కిట్లు పంపిణీ చేయాలి

పీసీపల్లి: ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని బుడ్డారెడ్డిపల్లి, పాతపాడు ఎన్టీఆర్ నగర్, కొత్తపాలెం గ్రామాల్లో ఉపాధి కూలీల పని ప్రదేశంలోకి వెళ్లి ఉపాధి పథకంలో ప్రభుత్వాలు చేపట్టిన మార్పులను వివరించారు.

సచివాలయం తనిఖీ

హనుమంతునిపాడు: మండల పరిధిలో కొండారెడ్డిపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ జీవీ క్రిష్టారావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత రికార్డులు, హాజరుపట్టి, సంక్షేమ పథకాల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. ఆయన వెంట ఈఓఆర్డీ షేక్ షరీఫ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సర్పంచ్ భారతీనారాయణ రెడ్డికి సన్మానం



సర్పంచ్ భారతీ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

సీఎస్‌పురం(పీసీపల్లి): మండలంలోని అయ్యలూరివారిపల్లి సర్పంచ్ ముత్యాల భారతీనారాయణరెడ్డిని మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అయ్యలూరివారిపల్లిని ఉత్తమ మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీగా ఎంపిక చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా సర్పంచ్ ముత్యాల భారతీనారాయణరెడ్డిని గ్రామస్తులు సన్మానించారు. తొలుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు.

27న దత్తాత్రేయ స్వామి ఆరాధన

లింగసముద్రం: మండలంలోని మొగిలిచర్ల గ్రామ శివార్లల్లో వెలిసిన దత్తాత్రేయస్వామి ఆరాధనోత్సం ఈ నెల 27న జరుగుతుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. 26న మొగిలిచర్ల గ్రామంలో దత్తాత్రేయ స్వామి మాలాధారులు, కలశాలతో స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 27న ఆరాధన దీక్ష స్వీకరించిన స్వాములతో పండరి భజన, అగ్నిగుండ ప్రవేశం, దత్త దీక్ష విరమణ జరుగుతాయని చెప్పారు. ఈ ఆరాధనకు కందుకూరు, కావలి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని చెప్పారు.

వాత్సల్య పథకానికి దరఖాస్తుల వెల్లువ

వెలిగండ్ల: మిషన్ వాత్సల్య పథకానికి ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి సూపర్‌వైజర్ పార్వతి, ఐసీడీఎస్ సిబ్బంది శామ్యూల్‌లు దరఖాస్తులు స్వీకరించారు. 18 ఏళ్ల లోపు వారు, పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తూ తల్లిదండ్రులను కోల్పోయి నిరాధరణకు గురైన నిరాశ్రయులు, నిస్సహాయ స్థితిలో ఉన్న అనాథ బాలలను గుర్తించి అర్హులైన బాలలను మిషన్ వాత్సల్య పథకం ద్వారా ప్రతి నెలకు రూ.4వేల ఆర్థిక భరోసా కల్పిస్తుంది. ఆ పథకానికి సంబంధించి దరఖాస్తులు ఐసీడీఎస్ కార్యాలయంలో ధాఖలు చేస్తున్నారు. స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు.

10 మంది జూదరులు అరెస్టు

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెంలో సోమవారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్న 10 మందిని ఎస్సై ఖాదర్ బాషా అరెస్టు చేశారు. జూదరుల నుంచి రూ.14,740 నదదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనునట్లు తెలిపారు.

పేదల సుఖమే జగనన్న లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- ఊళ్లపాలెం ఎస్టీ కాలనీలో పొసెషన్ సర్టిఫికెట్లు పంపిణీ



ఊళ్లపాలెం ఎస్టీ కాలనీలో పొసెషన్ సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులతో అశోక్‌బాబు

సింగరాయకొండ: పేదలు సుఖంగా జీవించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ ఎస్టీ కాలనీలో మంగళవారం 23 మందికి ఇళ్ల స్థలాల పొసెషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అశోక్‌బాబు మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో ఎస్టీ కాలనీలో 23 మంది బేస్‌మెంట్ వేసుకున్నాక నిధులివ్వకపోవడంతో వదిలేశారన్నారు. టీడీపీ నాయకులు చూస్తూ ఊరుకున్నారే తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవని, ఇప్పటికీ వారు గుడిసెల్లోనే జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యను తెలియజేయడంతో అధికారులతో మాట్లాడి పొసెషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయించడంతోపాటు ఇళ్ల నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలో నీరు–చెట్టు, ఇంకుడుగుంటలు పేరుతో కోట్లాది రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే స్వామి తన అనుచరులతో కలిసి నియోజకవర్గంలో 15 వేల మరుగుదొడ్లు కట్టకుండానే కట్టినట్టుగా చూపి రూ.22 కోట్లు స్వాహా చేశాడని ఆరోపించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ఎమ్మెల్యే స్వామి.. తన కుమారుడితో ఏసీ గదుల్లో ఆడుకుంటున్నాడని ఆక్షేపించారు. త్వరలో మరుగుదొడ్ల లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నా చేస్తానన్నారు. వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ కాళహస్తి వెంకారెడ్డి, ఎంపీటీసీ తంబు ఆదినారాయణ, నాయకులు పాకనాటి సుబ్బారెడ్డి, తంబు రఘురామయ్య, బిళ్లా కోటేశ్వరరావు, కుర్రి నరసింహారావు, కారాని నాగేశ్వరరావు, కావూరి ప్రబాకర్, మండల జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, పురిణి శ్రీనివాసులరెడ్డి, మల్లవరపు సుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి షేక్ సైదులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ షేక్ ముస్తఫా పాల్గొన్నారు.

కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తాం

- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



సూరం రమణారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బాలినేని

టంగుటూరు: కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తామని ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కారుమంచి గ్రామంలో మంగళవారం సూరం రమణారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో బాలినేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులను ఉద్దేశించి బాలినేని మాట్లాడుతూ.. తనకు పార్టీయే ముఖ్యమని, వ్యక్తులు కాదన్నారు. కొండపిలో పార్టీ జెండా ఎగిరేలా కృషి చేస్తానన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో కొండపి నియోజకవర్గంపై త్వరలోనే సమీక్ష నిర్వహించి, నాయకుల మధ్య విభేదాల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ అభివృద్ధికి, గ్రామాభివృద్ధికి సూరం రమణారెడ్డి కృషి చేశారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీకి కంచు కోట లాంటి కారుమంచి గ్రామ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. జయవరం, కారుమంచి మధ్య రాకపోకలకు ముసి నదిపై కాజ్‌వే నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సూరం రమణారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, నాయకులు సిరిపురం భాస్కరరెడ్డి, రావెల ప్రదీప్, పార్టీ మండల అధ్యక్షుడు సూదనగుంట హరిబాబు, సూదనగుంట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే



బస్సుయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: రాష్ట్రంలో నాయీబ్రాహ్మణులకు చేస్తున్న సాయానికి, అందిస్తున్న సహకారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో పాల్గొనేందుకు పలువురు నాయీబ్రాహ్మణులు మంగళవారం కందుకూరు నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ బస్సుయాత్రను ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, దేవాలయ బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించడంతో పాటు, షాపుల ఉన్న వారికి రూ.10వేల ఆర్థిక సాయం అందిస్తుందని వివరించారు. రాష్ట్ర నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేస్తున్న పార్టీ నాయకులు



వెంగళాయపల్లిలో జగనన్నే మా భవిష్యత్‌లో పాల్గొన్న నేతలు



ఈదరవారి పల్లెలో సంక్షేమ పథకాల జాబితా అందజేస్తున్న నేతలు

పామూరు: రాష్ట్ర ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద మహిళల కుటుంబాల్లో ఆర్థిక భరోసానిస్తున్నాయని వైఎస్సార్ సీపీ సచివాలయ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, ఎంపీటీసీ, పార్టీ ఎస్టీ సెల్ నాయకురాలు సవరం రత్తమ్మ అన్నారు. మండలంలోని అయ్యన్నకోటలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో అందించిన లబ్ధిని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందేవీరు, నేడు వైఎస్సార్‌సీ పీ అధికారంలోకి వచ్చిన తరువాత పథకాలు అందే తీరును వివరించారు. తుమ్మా పిచ్చిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహమిత్రలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డిలన్నారు. మండలంలోని కిస్టంపల్లి, ఈధరవారిపల్లి, వేములపాడు గ్రామాల్లో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హయాంలో అందిన లబ్ధిని, గత ప్రభుత్వ అవినీతిని వివరించారు. మండల రైతు సంఘు అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి, గాయం రమణారెడ్డి, గుంటక రమణారెడ్డి, గృహ సారథుల మండల కన్వీనర్ మద్ది తిరుపతయ్య, వైస్ ఎంపీపీ కొదమల బెంజి, కో ఆర్డినేటర్ చెక్కా రాము, కన్వీనర్లు చింతల చెరువు వెంకటేశ్వరెడ్డి, ఇరువూరి వెంకటేశ్వరెడ్డి, రామిరెడ్డి,రాయ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పీసీపల్లి సచివాలయ కన్వీనర్ శీలం సుదర్శనం, సీనియర్ నాయకుడు యేరువ నరసింహం అన్నారు. మండలంలోని వెంగళాయపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను అతికించారు. నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్లు, గృహసారథులు ఇరిగినేని హజరత్తు, మోత్కూరు కొండయ్య, అత్యాల యోహాను, కరణం మహాలక్ష్మయ్య, అత్యాల హనోకు, కర్లపూడి కొండయ్య, అత్యాల డేవిడ్ రాజు, అమ్మనబ్రోలు జగన్, ముప్పారపు కిశోర్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



నందిరెడ్డిపల్లిలో కల్యాణోత్సవం

హనుమంతునిపాడు: మండల పరిధిలోని నందిరెడ్డిపల్లిలో మంగళవారం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేద మంత్రాల నడుమ స్వామి కల్యాణం కనులపండువగా సాగింది. గ్రామానికి చెందిన గాండ్లపర్తి వెంకటేశ్వర్లు, జయమ్మ దంపతులు స్వామికి పట్టువస్త్రాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గాయం బలరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డిలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. నాయకులు ఆదినారాయణరెడ్డి ,ఏరువ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్‌లు యక్కటి వరలక్ష్మి, గాండ్ల పర్తి అంజలి పాల్గొన్నారు.

మలేరియా నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



కనిగిరి రూరల్‌లో ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ పెరుగు మురళీకృష్ణ

కనిగిరి రూరల్: మలేరియా నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ సాధ్యమవుతుందన్నారు. వైద్య విధాన పరిషత్ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ సయ్యద్ అబ్దుల్ కలాం మాట్లాడుతూ ప్రతి మంగళవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపు నిచ్చారు. తొలుత 'దోమ పుట్టరాదు, దోమ కుట్టరాదు' 'చేయి చేయి కలుపుదాం మలేరియాను అరికడదాం'– పరిసరాల పరిశుభ్రత మనందరి ఆరోగ్య భద్రత' అనే నినాదాలను ర్యాలీలో చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పి సరోజిని, వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, కిరణ్ కుమార్, నవకుమార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరు అర్బన్: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టరు ప్రియంవద తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం తూర్పువడ్డెపాలెం, సంతోష్ నగర్‌లోని యూపీహెచ్‌సీల ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా వ్యాధి విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ వైద్యాధికారులు డాక్టర్ పి. బ్యూలాగ్రీస్, పి.స్టెల్లా కారుణ్య, సబ్ యూనిట్ ఆఫీసర్, జి. వినయ్‌చంద్, షేక్ ఆరీఫుల్లా, హెల్త్ సూపర్‌వైజర్లు ఎం. శ్రీనివాసరావు, కె.పద్మావతి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ఆస్పత్రిలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సక్రమంగా విధులు నిర్వర్తించని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలపై చర్యలు తప్పవన్నారు. నెలవారీ నివేదికలు క్రమం తప్పకుండా అందించాలన్నారు. సీహెచ్‌ఓ కేవి చెన్నయ్య, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దోమల నివారణకు కృషి చేద్దాం

సింగరాయకొండ: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి ధీరజ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ధీరజ్‌కుమార్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. అనంతరం ఆస్పత్రి నుంచి చేపల మార్కెట్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఉజ్వల, డాక్టర్ వంశీధర్, డాక్టర్ లీనా, సిహెచ్‌ఓ సోమేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌ఆలీ, రాఘవేంద్రరావు, ఆదిలక్ష్మి, సులోచన, శోభ, మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

టంగుటూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ బాలాజీ అశోక్ సూచించారు. మండలంలోని ఆరోగ్య సిబ్బందితో టంగుటూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంట్లో, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమ తెరలు వినియోగించాలని చెప్పారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి



ఉప్పలపాడులో ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

పామూరు: శంకరజయంతి వేడుకలు స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శంకరాచార్యులు చిత్రపటంవద్ద నొస్సం నాగేంద్రాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంకరాచార్యుల వారు హిందూ ధర్మం, సంస్కృతి ఔన్నత్యానికి చేసిన కృషిని తెలియజేశారు. కార్యక్రమంలో మహిమలూరి మణిభూషణాచారి, చోడా భద్రయ్య, శివ బ్రహ్మాచారి, నొస్సం సుభేష్, తేజ, పృధ్వీ, సుష్మత్ పలువురు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలోజగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రావినూతల రమేష్ శర్మ, వంశీ కృష్ణా శర్మల ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం , విశిష్ట పూజలు చేశారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ శంకరులు అతి చిన్న వయస్సులోనే అఖండ భారత పరిక్రమన యాత్ర చేసి అన్ని మతాలు, కులాల వారిని ఏకం చేసి, సర్వమత సమ్మేళనం చేశారన్నారు. బ్రహ్మణ సంఘ నాయకులు మాచవరం సుబ్రహ్మణ్యం, ధూళిపాళ్ల వీర భద్రరావు, ధూళిపాళ్ల మల్లికార్జునరావు, సంగరాజు సాయి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిపూడి: మండల కేంద్రమైన మర్రిపూడిలో విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. శంకరాచార్యులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదుమూడి రవిప్రసాద్ మాట్లాడుతూ.. ఆదిశంకరాచార్యులు 16 ఏళ్లకే సన్యాసం స్వీకరించి, 24 గ్రంథాలకు భాష్యం రాసిన మహానుబావుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి ఈదుమూడి ప్రసాదు, జి.శ్రీనివాసులు, సురేష్, శ్రీకాంత్, అనీల్, లింగాల సాయి పాల్గొన్నారు.

కొండపి: మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలోని శివాలయంలో ఆదిశంకరాచార్యులు జయంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. శంకారాచార్యుల చిత్రపటానికి వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు రాఘవ శర్మ తీర్థప్రసాదాలు అందించారు.

క్లుప్తంగా...

ఇళ్ల పక్కన గోతులు తీస్తున్నాడు



సీఐ రంగనాథ్‌తో మాట్లాడుతున్న ఊళ్లపాలెం ఎస్టీ కాలనీ మహిళలు

సింగరాయకొండ: తమ ఇళ్ల పక్కనే టీడీపీ నాయకుడు పురిణి వెంకటేశ్వర్లు భారీగా గోతులు తీయిస్తున్నాడని, ఇదేమని ప్రశ్నిస్తే దాడికి పాల్పడుతున్నాడని సీఐ దాచేపల్లి రంగనాథ్‌కు మంగళవారం ఊళ్లపాలెం ఎస్టీ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకుడి భారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుతో కలిసి మంగళవారం సీఐని వేడుకున్నారు. గోతులు తీస్తే ఇంటి గోడలు కూలిపోతాయని అడ్డుకోబోతుంటే దాడి చేశాడని మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై సీఐ స్పందిస్తూ.. కాలనీలో పరిస్థితిని సమీక్షించి, స్థలం వివరాలపై నివేదిక ఇవ్వాలని ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమాను ఆదేశించారు. విచారించిన అనంతరం వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకుంటానని మహిళలకు సీఐ భరోసా ఇచ్చారు.

సర్పంచ్‌లకు సన్మానం



నూకవరం సర్పంచ్ శాంతమ్మను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ తదితరులు

వలేటివారిపాలెం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని నూకవరం పంచాయితీ జిల్లా స్థాయిలో ఉత్తమ బాలహిత పంచాయతీగా ఎంపికైంది. సోమవారం నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అన్నపూర్ణమ్మ, జిల్లా పరిషత్ సీఈఓ, డీపీఓ చిరంజీవి చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ దాచర్ల శాంతమ్మను ఘనంగా సన్మానించారు. అలాగే పంచాయితీ కార్యదర్శి కె.వేణుగోపాల్‌ని సత్కరించారు. ఈ సందర్భంగా శాంతమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా అడగులు వేస్తుందన్నారు. అలాగే మండల స్థాయిలో ఉత్తమ పంచాయితీగా ఎంపికై నందుకు చుండి సర్పంచ్ ఇరుపని సతీష్‌ను ఎంపీపీ మౌనిక, ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ ఘనంగా సన్మానించారు.

ఉత్తమ సేవకు పురస్కారం



ఉత్తమ ఎంపీటీసీగా అవార్డు అందుకుంటున్న అనితారెడ్డి

పామూరు: మండలంలోని వగ్గంపల్లె ఎంపీటీసీ సభ్యురాలు రెక్కల అనితారెడ్డి మెరుగైన ప్రజా పాలనా, సేవలకు తగిన గుర్తింపు లభించింది. ఒంగోలులో ఎన్టీఆర్ కళాపరిషత్‌లో మంగళవారం ఉత్తమ ఎంపీటీసీలకు సన్మానం, అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అనితారెడ్డిని జిల్లా సర్పంచుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. మెరుగైన సేవలు అందించేందుకు సహకరించిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పండు ఈగను నివారించుకోవాలి

ఉలవపాడు: మామిడిలో పండు ఈగను నివారించుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని చాగొల్లు సచివాలయంలో మామిడి రైతులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ మామిడిలో పండు ఈగలను నివారించుకోవాలంటే ఫ్రూట్ కవర్స్ ఉపయోగించుకోవాలని సూచించారు. దీని వల్ల పండు ఈగ నివారణంతోపాటు కాయ నాణ్యత కూడా పెరుగుతుందన్నారు. మామిడి కాయకు మంచి ధర వస్తుందని చెప్పారు. అకాల వర్షాలతో భీమవరం, వీరేపల్లి పరిధిలోని మామిడి కాయలు అధికంగా రాలాయని నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు కోరారు. ఉలవపాడు ఉద్యాన అధికారి బి.జ్యోతి, చాగొల్లు సర్పంచ్ లతా చంద్ర శేఖర్, వీరేపల్లి, చాకిచర్ల, భీమవరం, కె.రాజుపాలెం గ్రామ ఉద్యాన సహాయకులు, ఎఫ్‌పీఓ సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

లింగసముద్రం: పోక్సో చట్టంపై అవగాహన పెంచుకుని రక్షణ పొందాలని కావలి బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జి.మాల్యాద్రి అన్నారు. మండలంలోని పెద పవనిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు, హత్యలు, నివారించి వారి రక్షణ కోసం హెల్ప్‌లైన్ 181, 1098 వినియోగించుకుని రక్షణ పొందాలన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు న్యాయవాది ఐ.సాయి ప్రసాద్ మాట్లాడుతూ బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకుని బాల్య వివాహాలను నియంత్రించి ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు. కావలి లోక్‌అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి, ప్రిన్సిపాల్ కె.స్నేహలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది మాల్యాద్రి

అమూల్ కేంద్రాల్లో పాల సేకరణ పెంచాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): అమూల్ కేంద్రాల్లో పాల సేకరణ సామర్థ్యం పెంచాలని ఎంపీడీఓ పి.రామకృష్ణ సూచించారు. జరుగుమల్లి వైఎస్సార్ కేపీ కార్యాలయంలో మంగళవారం జగనన్న పాల వెల్లువ పథకంపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ.. వేసవిలో పాల సేకరణ తగ్గే అవకాశం ఉంటుందన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి, రోజూ 20 మందికి తగ్గకుండా పాల సేకరణ చేపట్టాలని సూచించారు. పశువైద్యాధికారి అరుణ, ఏపీఎం భాగ్యలక్ష్మి, వీఓఏలు, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.